నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
10 | ఖమ్మం, గురువారం 20 మార్చి 2025 | BHADRADRI KOTHAGUDEM

## బడ్జెట్ అంతా అంకెల గారడీ



కాంగ్రెస్ ప్రభుత్వం ఒక మధ్యంతర, రెండు వార్షిక బడ్జెట్లను ప్రవేశపెట్టినా అంకెల గారడీ తప్ప ప్రజలకు కొత్తగా ఒరిగిందేమీ లేదు. జ్యోతిరావు పూలే పేరుతో రూ.20 వేల కోట్ల సబ్‌ప్లాన్ కోసం బీసీలు గొంతెత్తి డిమాండ్ చేస్తే.. రూ.11,405 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నారు. నేతన్నల సంక్షేమం విషయంలో ప్రభుత్వానికి ఏమాత్రం పట్టింపు లేదని తేలిపోయింది. కేవలం రూ.371 కోట్లు మాత్రమే ప్రతిపాదించారు. భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయ అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్న జర్నలిస్టుల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో రూపాయి కూడా కేటాయించలేదు. కాంగ్రెస్ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజల ఆశలు, ఆకాంక్షలపై నీళ్లు చల్లే విధంగా ఉంది.

**–వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ సభ్యుడు**

## అన్ని రంగాలకూ అన్యాయం



బడ్జెట్ అంకెల గారడీలా ఉంది. అన్ని రంగాలకు అన్యాయం జరిగింది. వ్యవసాయ రంగానికి కేటాయించిన బడ్జెట్ కేవలం లెక్కలకే అన్నట్లుగా ఉంది. రైతులకు న్యాయం చేస్తారనే నమ్మకం లేదు. ఆటో కార్మికులు, యాదవుల గురించి ప్రస్తావించలేదు. వైన్స్ షాపుల్లో 25 శాతం రిజర్వేషన్ గౌడన్నలకు ఇస్తామన్న హామీపై ప్రస్తావన లేదు. దళితులను మోసం చేసింది. నిరుద్యోగులకు ఒక్క హామీ ఇవ్వలేదు. నిరుద్యోగ భృతి గురించి ఒక్కమాట కూడా ప్రస్తావించలేదు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థను పేకమేడలా కుప్పకూల్చారు. ట్రిలియన్ డాలర్‌కు ఎన్ని సున్నాలు ఉంటాయో కూడా తెలియని దరిద్రపు సర్కార్ కాంగ్రెస్‌ది.

**–మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**

## అరచేతిలో వైకుంఠం



కాంగ్రెస్ బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీలకు మంగళం పాడి అరచేతిలో వైకుంఠం చూపించింది. ఎన్నికల హామీలను విస్మరించింది. ప్రతి రంగానికి, అన్ని వర్గాలకు వెన్నుపోటు పొడిచింది. 40 శాతం కమీషన్ల కోసమే బడ్జెట్‌ను ప్రవేశపెట్టినట్లుగా స్పష్టమైంది. ఆటో డ్రైవర్ మొదలుకొని అన్నదాత వరకు అందరినీ మోసం చేసింది. ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. ఆకాశం నుంచి పాతాళానికి బడ్జెట్‌ను తీసుకెళ్లింది. మహిళలు, వృద్ధులకు ఇచ్చిన హామీలను ప్రస్తావించలేదు. తులం బంగారం ప్రస్తావన లేదు. చేనేతకు మా హయాంలో రూ.1,200 కోట్లు కేటాయిస్తే.. ఈ బడ్జెట్‌లో కేవలం రూ.300 కోట్లకే పరిమితం చేశారు.

**– ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్**

## అసమర్థ పాలనకు నిదర్శనం



కాంగ్రెస్ అసమర్థ పాలనకు ఈ బడ్జెట్ నిలువెత్తు నిదర్శనం. ఇచ్చిన హామీలకు కనీస కేటాయింపు లేకపోతే హామీలు ఇవ్వడం ఎందుకు? బీసీలకు కేవలం భిక్ష వేసినట్లు రూ.11,405 కోట్లు మాత్రమే ఇచ్చి బీసీల గొంతు కోశారు. ఆరు గ్యారెంటీలతోపాటు ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు వెన్నుపోటు పొడిచే బడ్జెట్ ఇది. ఆటోవాలా మొదలుకొని అన్నదాత వరకు అందరికీ అన్యాయమే జరిగింది. విద్య, వైద్య రంగాలకు కేటాయింపులు అంతంతమాత్రమే. బడ్జెట్ అంతా అరచేతిలో వైకుంఠంలా ఉంది. రాష్ట్ర బడ్జెట్‌పై ప్రతీ ఒక్కరూ పెదవి విరుస్తున్నారు.

**–రేగా కాంతారావు, బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు**

## 'సీతారామ'కు కేటాయింపులు లేవు



రాష్ట్ర బడ్జెట్‌లో భద్రాద్రి జిల్లాలోని సీతారామ ప్రాజెక్టు పనులకు నిధులు కేటాయించలేదు. ఏజెన్సీ ప్రాంతాలకు గోదావరి నీళ్లు ఇచ్చేందుకు, ఇల్లెందు నియోజకవర్గానికి నీళ్లు వచ్చేలా పనుల కోసం బడ్జెట్ కేటాయింపులు ఉంటాయని ఆశపడ్డాం. కానీ.. ఆ ఊసేలేదు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా సీతారామ ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవడం సరికాదు. రుణమాఫీ, రైతు భరోసా పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు నిధుల కేటాయింపు జరగలేదు. కేసీఆర్ రైతుల కోసం, పేదల కోసం ప్రవేశపెట్టిన పథకాలకూ కేటాయింపులు లేవాయె.

**–బానోత్ హరిప్రియానాయక్, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే**

## బడ్జెట్లో చెప్పినవన్నీ అబద్ధాలే..



రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఉన్నవన్నీ అబద్ధాలే. రూ.2 లక్షల రుణమాఫీ అందరు రైతులకు చేశామని చెప్పడం ఇందుకు నిదర్శనం. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి.. మహిళలకు బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీ తప్ప ఏవీ నెరవేర్చలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పిందొకటి.. బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టింది మరొకటి. కేసీఆర్ ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇస్తే.. ఆ ఉద్యోగాలు తాము ఇచ్చినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుకోవడం దారుణం. కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల కోసమే బడ్జెట్ ప్రవేశపెట్టినట్లుగా ఉంది.

**–లింగాల కమల్‌రాజు, ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్**

రాష్ట్ర శాసనసభలో ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కాంగ్రెసేతర రాజకీయ పక్షాల నేతలు, ప్రజలు, రైతులు పెదవివిరిచారు. పాత విషయాన్ని కొత్తగా చెప్పేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేసిందే తప్ప.. ప్రజల కష్టాలు, కన్నీళ్లను తీర్చేవిధంగా ఈ బడ్జెట్ ఎంతమాత్రమూ లేదని వ్యాఖ్యానించారు. పేదలకు, సంక్షేమ రంగానికి పూర్తిస్థాయిలో మేలుచేసేలా లేదని ఈ బడ్జెట్ లేదని అభిప్రాయపడ్డారు. బడ్జెట్ పేరుతో ఉమ్మడి జిల్లా ప్రజలకు ప్రభుత్వం గుండు సున్నా ఇచ్చిందని, ఏ మాత్రమూ ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకోలేదని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యానించారు. ప్రతీ రంగానికి, ప్రతీ వర్గానికి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని, కాంగ్రెస్ ఇచ్చిన హామీలకే ఆ ప్రభుత్వం మంగళం పాడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే.. వ్యవసాయం, విద్య, సంక్షేమం, గ్రామీణాభివృద్ధి, సాగునీటి రంగాలకు కేటాయించిన నిధులు ఎంతమాత్రమూ సరిపోవని స్పష్టం చేశారు. ఇక ఖమ్మం జిల్లాకు చెందిన ఉప ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లా ప్రజల ఆశలను, అవసరాలను ప్రతిబింబించలేకపోయిందని బీఆర్ఎస్, సీపీఎం, బీజేపీ, సీపీఐ, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా పార్టీల నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. –ఖమ్మం, మార్చి 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

# బారెడు సమస్యలకు.. చారెడే నిధులు..

- బడ్జెట్ కేటాయింపులపై ఉమ్మడి జిల్లా ప్రజల అసంతృప్తి
- సీతారామ ప్రాజెక్టు పనుల పూర్తికి అరకొర నిధులే..
- అత్యంత తక్కువ నిధుల కేటాయింపుపై రైతుల ఆగ్రహం
- విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు దక్కని ప్రాధాన్యం

బడ్జెట్‌లో కేటాయింపులు ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేశాయి. విద్య, సంక్షేమం, సాగునీటి రంగాల్లో పెద్దపీట లభిస్తుందని భావించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలకు.. ప్రభుత్వం ప్రత్యేక కేటాయింపులు ఏమీచేయకుండా రిక్తహస్తం చూపింది. లక్షలాది ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సీతారామ ప్రాజెక్టు నిర్మాణాన్ని ప్రారంభించారు. నిధులను వరదలా పారించారు. అయితే, ప్రాజెక్టు పనులు కొలిక్కివస్తున్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మాణ అంచనా వ్యయాన్ని రూ.19 వేల కోట్లకు రూపొందించింది. అయినా అందుకు తగినట్లుగా బడ్జెట్‌లో నిధుల కేటాయింపు మాత్రం జరగలేదు. దీంతో రైతుల్లో అసహనం వ్యక్తమవుతోంది. నిరుడు ఆగస్టు 15న వైరాకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. 2026 ఆగస్టు నాటికి సీతారామ ప్రాజెక్టును పూర్తిచేసి రైతులకు సాగునీరు అందిస్తామని ప్రకటించారు. కానీ ఈ బడ్జెట్ కేటాయింపులను పరిశీలిస్తే అత్తెసరు నిధులే విదిల్చినట్లుగా ఉంది. దీంతో ఈ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ఏడాదిలోనే పూర్తిచేయగలదన్న నమ్మకం రైతుల్లో సన్నగిల్లింది. సీతారామ నిర్మాణానికి ఇప్పటివరకు రూ.7 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేయగా మరో రూ.12 వేల కోట్లను ప్రభుత్వ అంచనా వ్యయం ప్రకారం ఖర్చుచేస్తే తప్ప ప్రాజెక్టు పూర్తయ్యే పరిస్థితి కన్పించడం లేదు. ఈ ఏడాది రూ.5 వేల కోట్లు ఈ సంవత్సరం అవసరం ఉండగా కేవలం రూ.699 కోట్లు మాత్రమే కేటాయించడంతో ప్రాజెక్టు పనులు మరింత నత్తనడక నడిచే ప్రమాదం ఉందన్న ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.



### అంతటా నిరాశే..

ఖమ్మం జిల్లాకు యూనివర్సిటీ లభిస్తుందని ఆశించిన విద్యార్థులకు ఈసారి కూడా నిరాశే మిగిలింది. గ్రామీణ ప్రాంతాల సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టనేలేదు. మౌలిక సదుపాయాల కల్పనకు అనుకున్న స్థాయిలో నిధులు లేవు. సాగునీటి ప్రాజెక్టులు, రహదారులు, వంతెనలు, కాలువల ఆధునీకరణ పనులు, విద్య, వైద్య శాఖల భవనాలు, మెడికల్ కళాశాల నిర్మాణానికి అవసరమైన నిధులు లభిస్తాయని ఆశించిన ప్రజలకు అసంతృప్తే మిగిలింది. సీతమ్మసాగర్ బ్యారేజ్‌కు ఎదురుచూపులు తప్పేలాలేవు.

## కాంగ్రెస్‌ది దివాళాకోరు బడ్జెట్



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది దివాళాకోరు బడ్జెట్. ఇది పేదల వ్యతిరేక బడ్జెట్. బడ్జెట్ అంతా ఢిల్లీకి మూటలు పంపించే విధంగా ఉంది. ఆరు గ్యారెంటీలతోపాటు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు వెన్నుపోటు పొడిచేలా ఉంది. పేదల సంక్షేమాన్ని విస్మరించి.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పేక మేడల్లా కాంగ్రెస్ ప్రభుత్వం కుప్ప కూల్చింది. దళితులు, బీసీలకు అన్యాయం చేసేలా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డికి మాటలు ఎక్కువ చేతలు తక్కువ.

**–వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే, కొత్తగూడెం**

## బడ్జెట్‌లో అందరికీ అన్యాయం



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అందరికీ, అన్ని వర్గాలకు అన్యాయం జరిగింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు సైతం నిధుల కేటాయింపు జరగలేదు. రైతులు, నిరుద్యోగులు, దివ్యాంగులు, వృద్ధులకు అన్నింటా అన్యాయం చేసింది. కాగితాలపై అంకెలు చూపిస్తూ సర్కారు గారడీ చేసినట్లుగా ఉంది బడ్జెట్.

**– మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి**

## హామీలకు అనుగుణంగా లేని బడ్జెట్



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అంకెలు, కేటాయింపులు ఘనంగానే కనిపించినా పాత బడ్జెట్ తరహాలోనే కొత్త మాటలతో ఉంది. ఆరు గ్యారెంటీలకు అనుగుణంగా లేదు. ఎన్నికల వాగ్ధానాలను బడ్జెట్‌లో విస్మరించారు. నిరుద్యోగ ఖాళీల భర్తీకి సంబంధించి ఊసేలేదు. విద్యారంగానికి గత ఏడాది కంటే స్వల్పంగా పెంచి చేతులు దులుపుకున్నారు. 58 ఇంటిగ్రేటెడ్ పాఠశాలల స్థాపన, వాటికి కేటాయింపుల గురించి ఘనంగా ప్రకటించారు. వైద్య ఆరోగ్య శాఖకు అనుగుణంగా నిధుల కేటాయింపు జరగలేదు. వ్యవసాయ రంగానికి తగిన నిధులు కేటాయించలేదు. రైతు భరోసా, రుణమాఫీ కేటాయింపు నిధులు సరిపోవు. నీటిపారుదల రంగానిదీ అదే పరిస్థితి. భట్టి బడ్జెట్ మాటలు ఘనం.. కేటాయింపులు స్వల్పం. రాష్ట్ర ప్రజల ఆశలపై నీళ్లు చల్లినట్లుంది కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్.

**–పోటు రంగారావు, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి, ఖమ్మం**

## విద్యారంగానికి మొండిచేయి చూపారు

- బడ్జెట్‌లో 7.57 శాతమే నిధులు కేటాయించడం దారుణం
- జిల్లాలో బడ్జెట్ ప్రతుల దహనంలో పీడీఎస్‌యూ నేతలు

కొత్తగూడెం టౌన్/ తిరుమలాయపాలెం, మార్చి 19: తెలంగాణ బడ్జెట్‌లో విద్యారంగానికి ప్రభుత్వం మొండిచేయి చూపిందని పీడీఎస్‌యూ నాయకులు విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం తక్కువ శాతం నిధులను కేటాయించడాన్ని నిరసిస్తూ ఆ సంఘం నాయకులు కొత్తగూడెం జిల్లా కేంద్రంలోనూ, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం బచ్చోడు గ్రామంలోనూ బుధవారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నేతలు మాట్లాడుతూ.. విద్యారంగానికి 15 శాతం బడ్జెట్ కేటాయిస్తామంటూ తన మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు ఆ హామీని నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. కేవలం 7.57 శాతం నిధులనే కేటాయించి విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని దుయ్యబట్టారు.



బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు



తిరుమలాయపాలెంలో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న విద్యార్థులు

## కాగితాలపై లెక్కల కోసమే బడ్జెట్



బడ్జెట్ కేటాయింపుల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎన్నికల హామీలు నెరవేర్చే ఉద్దేశం ఉన్నట్లు కనిపించడం లేదు. హామీల అమలులో చిత్తశుద్ధి లేకపోవడం వల్ల ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీకి కూడా నిధుల కేటాయింపు జరగలేదు. విద్య, వైద్య రంగాలను పూర్తిగా విస్మరించారు. సంక్షేమ రంగానికి నిధుల కేటాయింపు జరగలేదు. అభివృద్ధి పథకాలకు చెప్పుకోతగ్గట్లుగా నిధులు ఇవ్వలేదు. కాగితాలపై లెక్కల కోసమే అన్నట్లుగా బడ్జెట్ ఉంది. పేద ప్రజల కలలు ఈ బడ్జెట్ ద్వారా నెరవేరేలా లేవు. **–ఆర్జేసీ కృష్ణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఖమ్మం**

## హామీలకు వెన్నుపోటు పొడిచే బడ్జెట్



ఆరు గ్యారెంటీలతోపాటు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు వెన్నుపోటు పొడిచేలా ఉంది కాంగ్రెస్ బడ్జెట్. దివ్యాంగులు, వృద్ధులకు ఇచ్చిన హామీలను బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం సిగ్గుచేటు. పేదల సంక్షేమాన్ని గాలికొదిలేసేలా ఉంది. నిరుపేదలను పూర్తిగా విస్మరించింది. గత కేసీఆర్ ప్రభుత్వం యాదవులకు లబ్ధి చూపితే.. ఈ బడ్జెట్‌లో వారి ఊసేలేకపోవడం దుర్మార్గం. పూర్తి అంకెల గారడీని తలపించే విధంగా ఉంది బడ్జెట్.

**–కాపు సీతాలక్ష్మి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, కొత్తగూడెం**

## అభివృద్ధి అడ్రస్ గల్లంతు



కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో రాష్ట్ర అభివృద్ధి అడ్రస్ గల్లంతవుతుంది. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి మొండిచేయి చూపారు. 420 హామీలు ఈ బడ్జెట్‌లో కనుమరుగయ్యాయి. వృద్ధులు, దివ్యాంగుల పెన్షన్ పెంపు, మహిళలకు రూ.2,500, తులం బంగారం వంటి హామీలు బంగాళాఖాతంలో కలిపారు. రైతుకు రూ.15 వేలు, రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలకు మంగళం పాడారు. వ్యవసాయం, ఆరోగ్య శాఖకు నిధుల కేటాయింపు సరిగా లేదు.

**–మానె రామకృష్ణ, బీఆర్ఎస్ నియోజకవర్గ బాధ్యుడు, భద్రాచలం**

## కాంగ్రెస్ సర్కారుకు ముందుచూపు లేదు

- పంటలు ఎండిపోతున్నా పట్టింపులేదు
- అసెంబ్లీ వద్ద నిరసనలో ఎమ్మెల్సీ మధు



అసెంబ్లీ వద్ద నిరసనకు వరి కంకులతో వెళ్తున్న మధు

ఖమ్మం, మార్చి 19: కాంగ్రెస్ ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడమే పంటలు ఎండిపోవడానికి కారణమని ఎమ్మెల్సీ తాతా మధు విమర్శించారు. పంటలు ఎండిపోతున్న విషయంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిలదీస్తూ అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వరి కంకులు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ.. సాగునీటి వనరులు వినియోగించడం, ప్రాజెక్టులను నిర్వహించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదని ధ్వజమెత్తారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కేవలం కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువేనని, అది కూడా కేసీఆర్‌పై ఉన్న ద్వేషంతో సీఎం రేవంత్‌రెడ్డి తెచ్చిన కరువేనని దుయ్యబట్టారు.

## ఇన్విజిలేషన్ డ్యూటీలు మార్చరూ!

- విద్యాశాఖ పరీక్షల విభాగంలో అసిస్టెంట్ కమిషనర్ లేక ఉన్న సిబ్బందిపై పని ఒత్తిడి
- ప్రభుత్వ పరీక్షా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో పనిచేయని సీసీ కెమెరాలు
- 21 నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు ఎన్నో ఆటంకాలు

ఖమ్మం అర్బన్, మార్చి 19: పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇన్విజిలేషన్ విధులకు సంబంధించి ఉపాధ్యాయులకు ఉత్తర్వులు సైతం జారీ చేస్తున్నారు. ఈ క్రమంలో తమకు డ్యూటీలు మార్చాలంటూ ఉపాధ్యాయుల నుంచి వినతులు వెల్లువెత్తుతున్నాయి ఇన్విజిలేషన్ డ్యూటీ నుంచి సిట్టింగ్ స్క్వాడ్ వరకు అన్నింటా ఇదే వరుస కొనసాగుతున్నది. దీంతో పరీక్షల విభాగానికి రెగ్యులర్ అసిస్టెంట్ కమిషనర్ లేకపోవడంతో సిబ్బంది పని ఒత్తిడితో సతమతమవుతున్నారు.

### అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) లేకపోవడం 'పరీక్షే'..

పదో తరగతి పరీక్షల నిర్వహణలో విద్యాశాఖలో పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) చాలా కీలకం. హాల్‌టికెట్ల జారీ మొదలు ప్రత్యేక కేటగిరీలు, నామినల్ రోల్స్, సమాధాన పత్రాలు, ప్రశ్నపత్రాలు సరఫరా చేయడం, సీఎస్, డీవోల కేటాయింపు, ఇన్విజిలేషన్ డ్యూటీలు, ఫ్లయింగ్ స్క్వాడ్‌ల కేటాయింపులో కీలకంగా ఉంటారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను పరీక్షల విభాగం ఉన్నతాధికారులైన డిప్యూటీ కమిషనర్‌కు వివరించి ప్రత్యామ్నాయం కోసం సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఇంతటి కీలకమైన పోస్టులో రెగ్యులర్ ఏసీ లేకుండానే పరీక్షలకు వెళ్తుండడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. అక్టోబర్ నుంచి ఏసీగా పనిచేసిన ధన సెలవుపై వెళ్లడంతో రఘునాథపాలెం ఎంఈవో రాములుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. రెండు నెలలు అదనపు బాధ్యతలు నిర్వర్తించిన రాములు పని ఒత్తిడితో ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. అనంతరం నేలకొండపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రమేశ్‌కు అసిస్టెంట్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలను డీఈవో అప్పగించారు. ఆయన హెచ్‌ఎంగా, ఇంచార్జి ఏసీగా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో సమయం కేటాయించలేని పరిస్థితి నెలకొంది. ఇంచార్జిగా నియమించిన తర్వాత ర్యాటిఫికేషన్‌కు ఉన్నతాధికారులకు పంపించినా ఇప్పటివరకు ఇంచార్జి ఏసీ ర్యాటిఫికేషన్ పూర్తి కాలేదు.

### చాలాచోట్ల పనిచేయని సీసీ కెమెరాలు

జిల్లాలో పదో తరగతి పరీక్షల కోసం 97 కేంద్రాలను ఎంపిక చేశారు. వీటిలో 20కిపైగా ప్రైవేట్ స్కూల్స్ ఉండగా.. మిగిలినవి ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోనివి. ప్రైవేటు పాఠశాలల్లో సీసీ కెమెరాలు పనిచేస్తుండగా.. గత పరీక్షల సమయంలో అప్పటి కలెక్టర్ ప్రభుత్వ పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేసిన వాటిలో సైతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. ప్రశ్నపత్రాలను సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే తెరవాలనే నిబంధనను ఈసారి కూడా అమలు చేయనున్నారు. దీంతో చాలా చోట్ల సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. దీంతో టెక్నికల్ సిబ్బంది పాఠశాలల్లో తిరుగుతూ సీసీ కెమెరాల ప్రస్తుత పరిస్థితిని తెలుసుకుని విద్యాశాఖాధికారులకు వివరిస్తున్నారు. సీసీ కెమెరాలు పనిచేసేలా, వాటిలో సిమ్ కార్డులు వేసి కలెక్టరేట్‌కు అనుసంధానం చేసే ప్రక్రియను చేపట్టారు. రెండు రోజుల్లో పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో అమలులోకి వస్తాయా? లేదా? అనేది వేచి చూడాలి.

### డ్యూటీలు మార్చాలంటూ ఒత్తిడి..

కాగా.. ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వర్తించేందుకు ఆయా ఎంఈవోల సహకారంతో పరీక్షల విభాగం అధికారులు డ్యూటీలు కేటాయించారు. లాంగ్వేజెస్ పరీక్షకు నాన్ లాంగ్వేజెస్ ఉపాధ్యాయులు, నాన్ లాంగ్వేజెస్‌కు లాంగ్వేజెస్ ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించేలా నిబంధనలు పాటిస్తున్నారు. జిల్లాలో 1,585 మంది ఇన్విజిలేటర్లు అవసరం కాగా.. చాలా వరకు ఉత్తర్వులు జారీ చేయగా.. వీరిలో కొందరు తమకు డ్యూటీలు మార్చాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. తమకు నచ్చిన చోట వేయాలని కొందరు, మరికొందరు డ్యూటీ చేయలేం, ఆరోగ్యం సహకరించడం లేదని విన్నవిస్తుండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంకా ఇన్విజిలేషన్ డ్యూటీలు వేస్తూనే ఉన్నారు. అయినప్పటికీ ఇంకా ఇన్విజిలేటర్ల కొరత ఉంది. వీరితోపాటు ప్రతీ కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్‌లుగా ఇతర విభాగాల అధికారులను కలెక్టర్ నియమించారు. వారు సైతం తమకు కేటాయించిన కేంద్రం కాకుండా మరో కేంద్రానికి మార్చాలని ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తున్నది. ఇన్ని ఒత్తిళ్ల మధ్య పరీక్షల విభాగంలో సిబ్బందికి పనిచేయడం ఓ సవాల్‌గా మారింది. కాగా.. డ్యూటీలు, కేంద్రాల మార్పు విషయమై ఎలాంటి ఒత్తిళ్లు పనిచేయవని, ఉత్తర్వులను సిబ్బంది విధిగా పాటించాలని, లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఈవో ఏటూరు సోమశేఖరశర్మ తెలిపారు.

## పది పరీక్షల ఉమ్మడి జిల్లా అబ్జర్వర్‌గా విజయలక్ష్మీబాయి



ఎస్.విజయలక్ష్మీబాయి

ఖమ్మం అర్బన్, మార్చి 19: పదో తరగతి పరీక్షల ఉమ్మడి జిల్లా అబ్జర్వర్‌గా ఎస్.విజయలక్ష్మీబాయిని నియమించారు. ప్రస్తుతం విద్యాశాఖలో అడిషనల్ డైరెక్టర్ హోదాలో స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ (సైట్) డైరెక్టర్‌గా ఆమె పనిచేస్తున్నారు. గతంలో ఖమ్మం డీఈవోగా మూడేళ్లపాటు పనిచేశారు. అనంతరం పదోన్నతిపై హైదరాబాద్‌లో ఆర్జేడీగా వెళ్లారు. పరీక్షల పర్యవేక్షణ కోసం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అబ్జర్వర్‌గా మరోసారి జిల్లాకు వస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె 'నమస్తే'తో మాట్లాడుతూ గురువారం ఖమ్మం చేరుకొని రెండు జిల్లాల డీఈవోలతో చర్చించి, పరీక్షలు సజావుగా జరిగేందుకు కృషి చేస్తానని తెలిపారు.